
ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -360 పేజీలు - 8 వెల - 03/- శనివారం 18 ఏప్రిల్ 2026




# నెగ్గిన ప్రతిపక్షం

## పార్లమెంటులో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

- లభించని మూడింట రెండొంతుల మెజారిటీ
- మహిళా రిజర్వేషన్ల పేరుతో డీలిమిటేషన్ బిల్లులు పెట్టిన కేంద్రం
- ఓటింగ్‌లో పాల్గొన్న సభ్యులు 528
- బిల్లుకు అనుకూలం 298, వ్యతిరేకం 230
- ఆమోదానికి కావాల్సిన సంఖ్య 352
- మిగిలిన బిల్లులు ఉపసంహరించుకున్న కేంద్రం
- ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో మోడీషా ద్వయానికి పరాభవం
- నేడు కేంద్ర మంత్రివర్గం అత్యవసర సమావేశం

**న్యూఢిల్లీ ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** ఎన్నో రాజకీయ కుయుక్తులతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకపార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్షాలు ఐక్యంగా తిప్పికొట్టాయి. రెండ్రోజులు జరిగిన ఈ సమావేశాల్లో ప్రతిపక్షాలను రెచ్చగొట్టి, విభజించి బిల్లును ఆమోదింపచేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. లోక్‌సభలో మూడింట రెండొంతుల మద్దతు లభించకపోవడంతో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. ఈ బిల్లుపై జరిగిన ఓటింగ్మిగతా 2లో...



### రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా అనిల్ చంద్ర పునేఠా

- నియామకానికి గవర్నర్ ఆమోద ముద్ర



2లో

### వైసిపి రాజకీయ దురుద్దేశ విమర్శలు


- వాటిని పట్టించుకోమన్న అయ్యన్న పాత్రుడు



**అరకులోయ, ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో వెలసిన శ్రీ శాంతామణి దేవి పండుగ వేడుకల్లో రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. సకుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలపై అయ్యన్నపాత్రుడు తనదైన శైలిలో స్పందించారు. రాష్ట్ర ఖజానా మొత్తాన్ని కేవలం అమరావతిపైనే ఖర్చు చేస్తున్నారని వైసీపీ చేస్తున్న విమర్శలను స్పీకర్ తోసిపుచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ మిగతా2లో...

## ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

- హోర్ముజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన
- ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు



**టెహ్రాన్, ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** ప్రపంచా నికి ఇరాన్ శుభవార్త అందించింది. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచినట్లు ప్రకటించింది. ఇజ్రాయిల్, లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు అమాంతంగా పడిపోయాయి. మిగతా2లో...

## రాష్ట్రంలో ఎక్సైజ్ పాలసీలో మార్పులు

- ప్రజలకు నాణ్యమైన మద్యం సరఫరా
- జగన్ హయాంలో కల్తీ మద్యానికి 30వేల మంది మృతి
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



2లో

### తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

- లోయలో పడ్డ వ్యాన్: పదిమంది దుర్మరణం



2లో

## ప్రతిష్టకు భంగం కలిగేలా పోస్టులు పెడితే ఎలా?


### సజ్జల భార్గవరెడ్డిపై హైకోర్టు ఆగ్రహం



**అమరావతి, ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** ఇతరుల గౌరవ ప్రతిష్ఠలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వైసీపీ సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జ్ సజ్జల భార్గవ్ రెడ్డి , ఇతర నిందితులది అనాగరిక, ఆటవిక ప్రవర్తన అని ఆగ్రహించింది. ఈ క్రమంలో భార్గవ్ రెడ్డిపై న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తనపై జారీ చేసిన ఎల్‌ఓసీని రద్దు చేయాలని కోరుతూ సజ్జల భార్గవ్ రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రుల కుటుంబ సభ్యుల ప్రతిష్ఠకు

మిగతా2లో...

## కోట్లాది మంది మహిళలకు ద్రోహం



## 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

### కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి



**న్యూఢిల్లీ, ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** 2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి

మిగతా2లో...

# నెగ్గిన ప్రతిపక్షం



**మొదటిపేజీ తరువాయి**

లో 528 మంది సభ్యులు పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేశారు. వ్యతిరేకంగా 230 మంది ఓటు వేశారు. అయితే రాజ్యాంగ సవరణ బిల్లు కావడంతో పార్లమెంటులో మూడింట రెండొంతుల మంది సభ్యులు అనుకూలంగా ఓటు వేయాల్సి ఉంది. అంటే 352 మంది బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలి. కానీ అనుకూలంగా కేవలం 298 మంది మాత్రమే ఓటు వేయడంతో బిల్లు వీగిపోయింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు-2026, డీలిమిటేషన్ (పునర్విభజన) బిల్లు-2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులపై రెండు రోజుల పాటు లోక్ సభలో చర్చ జరిగింది. బిల్లులపై జరిగిన చర్చలో గురువారం 84 మంది, శుక్రవారం 49 మంది సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఆ తరువాత కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదం కోసం సభ ముందు ఉంచారు. అనంతరం స్పీకర్ ఓంబిర్లా బిల్లుపై ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. లోక్ సభ సెక్రెటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ ఓటింగ్ జరిగే ప్రక్రియ, ఓటు వేసే విధానంపై సభ్యులకు వివరించారు. అనంతరం ఓటింగ్ జరిగింది. మొత్తం 528 మంది ఓట్లు వేయగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయని స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. దీంతో బిల్లు వీగిపోయినట్టు ప్రకటించారు. ఈ క్రమంలో మిగతా రెండు బిల్లులు డీలిమిటేషన్ (పునర్విభజన) బిల్లు-2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులను ఉపసంహరించుకుంటున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు.

**పారని మోదీ, అమిత్ షా ఎత్తుగడలు**

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుపెట్టి నియోజకవర్గాలను తమకు అనుకూలంగా పెంచుకుని, 2029 ఎన్నికల్లో గెలవాలనే ప్రయత్నాలకు అడ్డుకట్టపడింది. మహిళా రిజర్వేషన్ బిల్లు అనే సెంటిమెంట్‌తో ప్రచారం చేసిన తమ రాజకీయ లక్ష్యం నెరవేర్చేందుకు ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వేసిన పాచికలు పారలేదు. వారి కుట్రలను ప్రతిపక్షం ఐక్యంగా అడ్డుకుంది. అంతేకాకుండా పార్లమెంట్ సాక్షిగా ఎన్డీఏ కుట్రలను ఎండగట్టింది. మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో తీసుకొచ్చిన డీలిమిటేషన్ బిల్లుల కుట్రలను బయటపెట్టింది. మహిళ రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వకపోతే చరిత్ర హీనులవుతారని ప్రధాని మోడీ పదేపదే ప్రకటించారు. అయితే మహిళ రిజర్వేషన్ ముసుగులో తీసుకొచ్చిన డీలిమిటేషన్ బిల్లుల గురించి పెద్దగా చర్చలేకుండా చేశారు. ఈ కుట్రలను ప్రతిపక్షం ముక్తకంఠంతో వ్యతిరేకించి, బిల్లుల స్వరూపాన్ని దేశ ప్రజలకు వివరించింది. ఈ బిల్లులతో సమాఖ్యవాదంపై తీవ్రమైన దాడి జరుగుతుంది. అంతేకాకుండా రాజ్యాంగ విరుద్ధమైన ఈ బిల్లులు పార్లమెంటరీ వ్యవస్థను బుల్డోజ్ చేస్తాయి. ఈ బిల్లులతో దక్షిణ, ఈశాన్య రాష్ట్రాలు, పంజాబ్, ఒడిశాతో పాటు చిన్న రాష్ట్రాలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. అధికార పక్షం వలలో పడకుండా ప్రతిపక్షం జరుగుతున్న నష్టాన్ని ప్రజలకు వివరించింది. దీంతో మోడీ, అమిత్ షా పరివారం తోకముడిచింది. ఈ నేపథ్యంలో శనివారం కేంద్ర మంత్రివర్గ అత్యవసరంగా సమావేశం అవుతున్నది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో బిల్లుల అంశాలను ప్రస్తావించాలన్నదే బీజేపీ ఎత్తుగడగా కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

## ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ రవాణాకు కీలకంగా మారిన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇరాన్ తాజా ప్రకటనతో.. హోర్ముజ్ జలసంధిలో ఇకపై అన్ని వాణిజ్య నౌకలకు ప్రవేశం ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్య రవాణాకు కీలకమైన ఈ జలమార్గంలో వాణిజ్య నౌకల ప్రయాణాలకు మార్గం సుగమమైంది. ఇరాన్, ఇతర దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే ఈ జలమార్గంపై.. కొన్ని నెలలుగా వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, కాల్పుల విరమణ సమయం ముగిసేవరకూ.. యథావిధిగా వాణిజ్య రవాణా కొనసాగించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. కాగా.. హోర్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సుమారు 20 శాతం ప్రపంచ క్రూడాయిల్ సరఫరా అవుతుందన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడ డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు.ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్ల పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది.

# కోట్లాది మంది మహిళలకు ద్రోహం

**విపక్షాలపై సీఎం చంద్రబాబు మండిపాటు**

**అమరావతి, ఏప్రిల్ 17 ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు అడ్డుకోవడంపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఈ బిల్లును అడ్డుకోవడం ద్వారా మహిళా సాధికారత దిశగా భారతదేశం వేయాల్సిన చారిత్రక అడుగును అడ్డుకున్నాయని అన్నారు. సమాన గొంతుక, సరైన ప్రాతినిధ్యం కోరుకుంటున్న కోట్లాది మంది భారతీయ మహిళలకు విపక్షాలు ద్రోహం చేశాయని 'ఎక్స్'లో ఆరోపించారు. 'నియోజకవర్గాల పునర్విభజన, రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించడం ద్వారా ప్రతిపక్ష పార్టీలు దేశానికి



గొప్ప అపకారం చేశాయి. 2026 తర్వాత నిర్వహించే జనాభా లెక్కల అనంతరం ఆర్టికల్ 81 కింద విధించిన స్తంభన ముగియనున్న నేపథ్యంలో ఇకపై కేవలం జనాభా ఆధారంగానే సీట్ల పంపిణీని పునఃసమీక్షించనున్నారు. దీంతో దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ రాష్ట్రాల వాణిని కాపాడటానికి, మహిళలకు 33శాతం ప్రాతినిధ్యం కల్పించడానికి ఎన్డీయే నిజాయితీగా ఒక ప్రతిపాదన చేసింది. అయితే దీర్ఘకాలిక జాతీయ ప్రయోజనాలపై రాజకీయ అజెండాలు పైచేయి సాధించడం దురదృష్టకరం. ఈ ఫలితంతో సంబరాలు చేసుకుంటున్నవారు ఆత్మపరిశీలన చేసుకోవాలి. సముచిత ప్రాతినిధ్యం కోసం ఒక న్యాయబద్ధమైన, రాజ్యాంగపరమైన రక్షణను పొందే అవకాశం మనం కోల్పోయాం' అని ఆ పోస్టులో చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

## బాధ్యతారహితంగా రాహుల్ ప్రసంగం

**వైద్యశాఖమంత్రి సత్య కుమార్ యాదవ్ ఆగ్రహం**

**విజయవాడ, ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** నారీ శక్తీ వందనం బిల్లుపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అత్యంత బాధ్యతారహితంగా మాట్లాడారని ఏపీ వైద్యశాఖమంత్రి సత్య కుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారిత బిల్లుపై, మహిళల అభివృద్ధి గురించి మాట్లాడమంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అవహేళనగా మాట్లాడారని ధ్వజమెత్తారు. ఒక దేశ ప్రధానిని పట్టుకుని జాదూఘర్, ఓ మ్యాజిషన్ అని, ఓ సైనిక శక్తిని అవహేళన చేసేలా రాహుల్ గాంధీ మాట్లాడారని.. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ.. మోదీపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలందరికీ రాహుల్ ఫ్రస్టేషన్ అనేది తేటతెల్లమవుతుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ విమర్శించారు. ఓ ప్రతిపక్ష నేతగా ఉండాల్సిన అర్హతలు రాహుల్ గాంధీకి ఏమాత్రం లేవని ఎద్దేవా చేశారు. దేశ ప్రధాని మోదీ డెసిషన్, లీడర్ షిప్‌ని ప్రజలందరూ చూశారని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి కళ్లముందు కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయంగా భారతదేశానికి ఖ్యాతి తీసుకొచ్చేలా



ప్రధాని మోదీ చర్యలు చేపట్టారని ఉద్ఘాటించారు. మన సైనిక శక్తిని, దేశ భద్రతను అవమానించే విధంగా రాహుల్ గాంధీ మాట్లాడటం అత్యంత హేయమని ఆగ్రహించారు. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పేలా ప్రధాని మోదీ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని ప్రస్తావించారు. సైనికుల బలం మన దేశ భద్రత సత్తా ఏంటో తెలిసి పాకిస్థాన్ కూడా తమపై దాడులు జరిగాయని ఒప్పుకుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. అలాంటి దేశ భద్రతపై, సైనికులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఏ శక్తివంతమైన దేశానికి మన దేశం తీసిపోకుండా చేశారని చెప్పారు. నల్లధనాన్ని కట్టడి చేసినందుకు దేశ ప్రజలందరూ స్వాగతించారని అన్నారు. ప్రజల విజ్ఞతను రాహుల్ ప్రశ్నిస్తున్నారా..? అని దుయ్యబట్టారు. ఎవరి హయాంలో ఎలా పాలనా సాగిందో ప్రజలందరూ మర్చిపోలేదని చెప్పారు. 2జీ స్కాం దగ్గర నుంచి కోల్ స్కాం వరకు లక్షల కోట్లు ఏవిధంగా దోచుకున్నారో అందరికీ తెలుసునని అన్నారు. మహిళల సాధికారత కోసం తీసుకొస్తున్న బిల్లును వ్యతిరేకించటం రాహుల్ గాంధీ మనస్తత్వం ఏంటో అర్థమవుతుందని విమర్శించారు. అవినీతి, ఆరోపణ లేకుండా అత్యంత పారదర్శకంగా మోదీ పాలన అందిస్తున్నారని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

## రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా అనిల్ చంద్ర పునేఠా

**అమరావతి, ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** :రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్ చంద్ర పునేఠా నియామకానికి ఆమోదం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోద ముద్ర వేశారు. అనిల్ చంద్ర పునేఠాను ఎస్ఈసీగా నియమిస్తూ ప్రభుత్వం జీఓను విడుదల చేయనుంది. అనిల్ చంద్ర పునేఠా గతంలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం ఆయన విజిలెన్స్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గవర్నర్ ఆమోదం లభించడంతో ప్రభుత్వం అధికారిక జీఓ జారీ చేసి.. అనిల్ చంద్ర పునేఠాకు పూర్తి బాధ్యతలు అప్పగించనుంది. పంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్తుల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ నియామకం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అనిల్ చంద్ర పునేఠా ఐఏఎస్ 1984 బ్యాచ్ అధికారి. రాష్ట్రంలో వివిధ కీలక శాఖల్లో పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. గతంలో కొన్ని సందర్భాల్లో ఎన్నికల సంబంధిత బాధ్యతలు కూడా నిర్వహించిన విషయం తెలిసిందే. జీఓ విడుదలైన వెంటనే అధికారికంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా అనిల్ చంద్ర పునేఠా బాధ్యతలు చేపట్టనున్నారు.

## వైసిపి రాజకీయ దురుద్దేశ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

సంపూర్ణ సహకారంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. అందరి సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యం. ఇలాంటి పవిత్రమైన పుణ్యక్షేత్రంలో వైసీపీ నేతల గురించి మాట్లాడటం ఇష్టం లేదు. వారి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు' అని అన్నారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**చెన్నై, ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** తమిళనాడులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ లోయలో పడ్డ ఘటనలో 10 మంది చనిపోగా.. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. కోయంబత్తూరు జిల్లాలోని వాల్పరై ఘాట్ రోడ్డులో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పింది. వేగంగా వెళ్లి లోయలో పడిపోయింది. పైనుంచి కిందపడ్డంతో వ్యాన్ నుజ్జునుజ్జయింది. వ్యానులో ఉన్న పది మంది అక్కడికక్కడే చనిపోయారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు 10 మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై వేగంగా దూసుకు వెళుతున్న కారు టైర్ పేలింది. ఒక్కసారిగా అదుపుతప్పిన కారు.. వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా కారుకు వ్యాపించాయి. కారు, బస్సు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరు మంది కాలి బూడిదయ్యారు. బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి.

## రాష్ట్రంలో ఎక్సైజ్ పాలసీలో మార్పులు

**గుంటూరు ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం నియంత్రణ, నాణ్యత విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో నాసిరకం మద్యం సేవించి అనేక మంది అనారోగ్యానికి గురయ్యారని, దాదాపు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. జగన్ రెడ్డి పాలనలో సరైన బ్రాండ్లు అందుబాటులో లేక ప్రజలు ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చుకుని తాగాల్సి వచ్చిందని విమర్శించారు. దేశంలోనే అతిపెద్ద మద్యం స్కామ్ వైసీపీ ప్రభుత్వంలోనే జరిగిందని, దాదాపు రూ.3,500 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, చిత్తూరు ప్రాంతాల్లో అత్యాధునిక ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. మద్యం నాణ్యతను పరీక్షించి, ప్రజలకు హానికరంగా ఉన్న బ్రాండ్లను పూర్తిగా తొలగించినట్లు చెప్పారు. ప్రజలు విచ్చలవిడిగా మద్యం సేవించకుండా ఉండేందుకు వైన్ షాపుల్లో ప్రత్యేక గదుల (రూమ్) అనుమతులు కూడా ఇచ్చామని మంత్రి వివరించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా మద్యం విధానంలో మరిన్ని మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## ప్రతిష్టకు భంగం కలిగేలా పోస్టులు పెడితే ఎలా?

(మొదటి పేజీ తరువాయి)

భంగం కలిగించే పోస్టులు ఎలా పెడతారని న్యాయస్థానం ప్రశ్నించింది. వాక్ స్వాతంత్రం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు పరిమితులు ఉన్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తును సక్రమంగా చేసి నిందితులకు శిక్షపడేలా చేయాలని పోలీసులను ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కోరినప్పుడు విచారణకు హాజరు అవుతానని అఫిడవిట్ వేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఎల్ఓసీని రీ కాల్ చేయాలని అన్నమయ్య జిల్లా ఎస్పీకి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అభ్యర్థన వచ్చిన వెంటనే ఎల్ఓసీని రద్దు చేయాలని ఇమిగ్రేషన్ అధికారులకు ఏపీ హై కోర్టు ఆదేశించింది.

## 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

భంగం కలిగించే పోస్టులు ఎలా పెడతారని న్యాయస్థానం ప్రశ్నించింది. వాక్ స్వాతంత్రం, ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ.1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888
శనివారం 18 ఏప్రిల్ 2026

# సమానత్వ భారత నిర్మాణానికి మరో బలమైన అడుగు

### :- రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ

**దేవనకొండ ఏప్రిల్ 17( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** దేశంలో మహిళల సాధికారత దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న 33%శాతం రిజర్వేషన్ నిర్ణయం చారిత్రాత్మకమని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ పేర్కొన్నారు. ఈ నిర్ణయం భారత రాజకీయ వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికిందన్నారు.



మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సమతుల్యత సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. చాలా కాలంగా రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం లేక వెనుకబడ్డ మహిళలకు ఇది ఒక గొప్ప అవకాశమని తెలిపారు.

ఈ నిర్ణయం వల్ల మహిళలు తమ ప్రతిభను నిరూపించుకునే వేదిక లభించిందని, దీని ద్వారా సమాజంలో మహిళల పాత్ర మరింత బలపడుతుందని చెప్పారు. మహిళలు ముందుకు వస్తే కుటుంబ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆమె పేర్కొన్నారు.

కుటుంబం బలంగా ఉంటే సమాజం బలంగా ఉంటుంది, సమాజం బలంగా ఉంటే దేశం అభివృద్ధి చెందుతుందని ఆమె వివరించారు. అందుకే మహిళల అభివృద్ధి దేశ అభివృద్ధికి కీలకమని స్పష్టం చేశారు. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం వల్ల పాలనలో పారదర్శకత, సమర్థత పెరుగుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. మహిళలు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజల సమస్యలను సున్నితంగా పరిష్కరిస్తారని తెలిపారు. ఈ చట్టం అమలుతో గ్రామస్థాయి నుండి పార్లమెంట్ వరకు మహిళలు నాయకత్వంలో ముందుకు వస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది దేశ భవిష్యత్తును మరింత ప్రగతిపథంలో నడిపిస్తుందని పేర్కొన్నారు. మహిళల విద్య, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం ఇవన్నీ ఈ నిర్ణయంతో మరింత బలపడతాయని ఆమె అన్నారు. ఇది కేవలం ఒక చట్టం మాత్రమే కాకుండా, సామాజిక మార్పుకు దారితీసే విప్లవాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమలోని నాయకత్వ లక్షణాలను బయటపెట్టాలని ఆమె పిలుపునిచ్చారు. భయపడకుండా ముందుకు వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు.

మహిళలు రాజకీయాల్లోకి రావడం ద్వారా యువతకు కూడా స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు. ఇది భవిష్యత్ తరాలకు మంచి మార్గదర్శకత్వాన్ని అందిస్తుందని అన్నారు. ఈ నిర్ణయం నిజమైన ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుందని, సమానత్వ భారత నిర్మాణానికి ఇది మరో బలమైన అడుగని ఆమె అభిప్రాయపడ్డారు.

మహిళలకు గౌరవం ఇచ్చే దేశమే నిజమైన అభివృద్ధి చెందిన దేశమని పేర్కొన్నారు. అందుకు ఈ నిర్ణయం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న భారత ప్రభుత్వానికి, అలాగే దీనికి మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలకు కప్పట్రాల్లా బొజ్జమ్మ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# దేవనకొండ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్ట్ భర్తీ చేయాలి.

**దేవనకొండలో పిహెచ్సి వైద్యాధికారి కి వినతిపత్రం అందించిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు..**

**దేవనకొండ ఏప్రిల్ 17( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం నందు ల్యాబ్ టెక్నీషియన్ లేక రోగులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కె. భాస్కర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎం. రామాంజనేయులు లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో పిహెచ్సీ నందు వైద్యాధికారి విజయ భాస్కర్ కు వినతి పత్రాన్ని అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోనే అతి పెద్దదైన దేవనకొండ మండలంలో ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడం వలన మహిళలు, గర్భిణీలు, బాలింతలు, వయోవృద్ధులు, చిన్నపిల్లలు సైతం రోగాల బారిన పడితే రక్త పరీక్షల ద్వారా నిర్ధారించే వ్యాధులు ఆలస్యం కావడం జరుగుతుందన్నారు.గతంలో అనేకమార్లు ల్యాబ్ టెక్నీషియన్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరినప్పటికీ ఏమాత్రం స్పందించకపోవడం దారుణం గా ఉందన్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో గల పీహెచ్సీ నందు ల్యాబ్ టెక్నీషియన్ ను నియమించి రోగుల అవస్థలను తీర్చాలన్నారు. అలాగే పిహెచ్సి నందు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. తక్షణమే సమస్య పరిష్కారానికి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో విద్యార్థి, యువజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం మండల నాయకులు వీరాంజనేయులు, సురేంద్ర, మనోజ్, భరత్, రవి తదితరులు పాల్గొన్నారు.



# కర్నూలు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన కమిషనర్ విశ్వనాథ్

### 9 నెలల సేవలో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం

### బదిలీపై రాజకీయ ఒత్తిళ్లు లేవని స్పష్టం



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 17)** కర్నూలు నగర అభివృద్ధికి ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని, ఎప్పటికీ వారికి కృతజ్ఞుడిగా ఉంటానని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం పాత కంట్రోల్ రూం వద్ద ఉన్న కమిషనర్ క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు.గత 9 నెలల కాలంలో స్వచ్ఛత, పచ్చదనం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిపాలనా సంస్కరణల దిశగా అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. 'కర్నూలుకు హరితహారం', గార్బేజ్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, రాత్రి పారిశుద్ధ్య పనులు, అవగాహన కార్యక్రమాలు, ఎల్ఆర్ఎస్, బిపియస్ అమలు, పీజీఆర్ఎస్, దయల్ యువర్ కమిషనర్, ఓపెన్ ఫోరం వంటి కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యాయని వివరించారు.అలాగే బుధవారపేట మెడికల్ కాలేజీ మలుపు విస్తరణ, రహదారులు-డ్రైనేజీ నిర్మాణాలు, పిచ్చి మొక్కల తొలగింపు, స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు, ఈట్ స్ట్రీట్లు, వెండర్ జోన్లు, డాగ్ షెల్టర్ ఏర్పాటు, టిడ్కో గృహాల మరమ్మత్తులు, తాగునీటి పైపుల లీకేజీల పరిష్కారం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల విజయానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు అందించిన సహకారం కీలకమని కొనియాడారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంకు సాధించడంలో విద్యార్థులు, విద్యాసంస్థల పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు.తన బదిలీ పూర్తిగా వ్యక్తిగత కారణాల వల్ల ప్రభుత్వానికి చేసిన అభ్యర్థన మేరకే జరిగిందని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధుల సహకారంతోనే వినూత్న కార్యక్రమాలు అమలు చేయగలిగామని తెలిపారు.భవిష్యత్తులో కూడా కర్నూలు నగర అభివృద్ధికి ప్రజలు ఇదే విధంగా సహకరించాలని, నగరం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రోడ్డు భద్రతా సూచనలు పాటించండి సురక్షితంగా గమ్యం చేరండి

### - సీఐ వేణుగోపాల్

**దేవనకొండ ఏప్రిల్ 17 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** దేవనకొండ మండలంలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసులు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

"రోడ్డు భద్రతా ఆలోచనలను పాటించండి మీ ప్రాణాలకు మీరు రక్షణ చేసుకోండి" అని ఆయన స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు.వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వాడాలని తెలిపారు. ఇవి ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే ప్రధాన భద్రతా చర్యలని పేర్కొన్నారు.అధిక వేగంతో వాహనం నడపడం ప్రమాదాలకు కారణమవుతుందని, ఎప్పుడూ నియంత్రిత వేగంతోనే ప్రయాణించాలని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం పూర్తిగా నిషేధమని చెప్పారు.వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వాడకూడదని హెచ్చరించారు. దృష్టి చెదిరితే ప్రమాదం తప్పదని అన్నారు.పాదచారులు కూడా ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. జీబ్రా క్రాసింగ్‌లను ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు.యువత ప్రత్యేకంగా బాధ్యతతో డ్రైవింగ్ చేయాలని, స్టంట్లు చేయడం, నిర్లక్ష్యంగా నడపడం మానుకోవాలని సూచించారు.వాహనాలకు సంబంధించిన పత్రాలు ఎప్పుడూ సక్రమంగా ఉంచుకోవాలని, నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల కోసం అయినా భద్రతా నియమాలను పాటించాలని కోరారు.పిల్లలకు చిన్నప్పటి నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని అన్నారు."సురక్షితంగా మీ గమ్యం చేరడం ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలి" అని సీఐ వేణుగోపాల్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పోలీసుల సూచనలను స్వాగతిస్తూ, రోడ్డు భద్రతకు సహకరిస్తామని తెలిపారు.

# పోలీసు ప్రతిష్ట పెంచేలా హోంగార్డులు సేవలు అందించాలి

### : కమాండెంట్ మహేష్ కుమార్

### తమిళనాడు ఎన్నికల విధుల్లో అప్రమత్తత

### క్రమశిక్షణ, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచన

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 17)** పోలీసు వ్యవస్థలో హోంగార్డుల పాత్ర అత్యంత కీలకమని, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ శాఖ ప్రతిష్టను పెంచేలా పని చేయాలని సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ పేర్కొన్నారు.

కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో హోంగార్డులకు ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ మహేష్ కుమార్ హోంగార్డుల గౌరవ వందనం స్వీకరించి, సిబ్బంది పనితీరును పరిశీలించారు.త్వరలో తమిళనాడులో జరగనున్న సాధారణ ఎన్నికల విధులకు వెళ్లనున్న హోంగార్డులకు ఆయన దిశానిర్దేశం చేశారు. విధుల్లో ఓర్పుతో ఉండాలని, ఓటర్లతో మర్యాదగా ప్రవర్తిస్తూ నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి జిల్లా పోలీసు యంత్రాంగానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పోలీసు విధుల్లో ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి సమర్థవంతమైన సేవలు అందించగలమని తెలిపారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, ప్రయాణాల సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా, వ్యక్తిగత బీమా తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు.అనంతరం నిర్వహించిన 'దర్బార్'లో హోంగార్డులు తమ సమస్యలను కమాండెంట్ దృష్టికి తీసుకెళ్లగా, వాటిని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, ఆర్ఐ పోతల రాజు, ఆర్ఎస్ఐలు మరియు హోంగార్డులు పాల్గొన్నారు.






# సీబీఎస్ఈ పరీక్షలలో పీ.ఎం.శ్రీ కేంద్రీయ విద్యాలయ కర్నూలు విద్యార్థుల ప్రతిభ







**కర్నూలు ప్రతినిధి, ఏప్రిల్ 17,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** సీబీఎసీబీ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ కర్నూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ పాయల్ ప్రియదర్శిని తెలిపారు. విద్యాలయంలో గురువారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ.. తోట మోహన్ తేజేశ్వర్ 473 మార్కులతో ప్రథమ స్థానం, చిన్న హరి ప్రకాష్ 465 మార్కులతో ద్వితీయ, ఇ. వెంకట హర్షిత 459 మార్కులతో తృతీయ స్థానం సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పాయల్ ప్రియదర్శిని, వైస్ ప్రిన్సిపల్ ఆంజనేయులు, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో జీఎస్టీ వసూళ్లు కట్టుదిట్టం చేయాలి

### ప్రతి పరిశ్రమకు తప్పనిసరిగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ పెండింగ్ రూ.190 కోట్లు వసూలు చేయాలి: కలెక్టర్ డా.ఏ.సిరి





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 17)** కర్నూలు జిల్లాలో పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. పన్నుల వసూళ్లలో ఎటువంటి జాప్యం లేకుండా ప్రక్రియ కొనసాగించాలని సూచించారు.

శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జీఎస్టీ కోఆర్డినేషన్ సమావేశంలో కలెక్టర్ ఈ మేరకు మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ ఆదాయ మార్గాలను మెరుగుపరచడంతో పాటు పన్ను వసూళ్లలో పారదర్శకత పెంచాలని తెలిపారు.

ఓర్వకల్ నోడ్‌లో భాగంగా ఉన్న ఎన్ఐసిడిసి ప్రాజెక్టులకు సంబంధించిన కాంట్రాక్టర్ల జీఎస్టీ రిజిస్ట్రేషన్ స్థితిని తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని అన్ని పరిశ్రమలు జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకున్నాయా లేదా అనే అంశాన్ని కూడా సమగ్రంగా పరిశీలించాలని కమర్షియల్ టాక్స్ అధికారులకు సూచించారు.నెడ్‌క్యాప్ ద్వారా ఏర్పాటు కానున్న పవర్ కంపెనీల వివరాలు సేకరించి, వాటికి జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించాలని చెప్పారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, రిజిస్ట్రేషన్ ఫీజులు సక్రమంగా చెల్లిస్తున్నారో లేదో పర్యవేక్షించి, పన్ను ఎగవేతను అరికట్టాలని ఆదేశించారు.జిల్లాలో దాదాపు రూ.190 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని సూచించారు. పాన్ నంబర్ ఆధారంగా వివిధ బ్యాంక్ ఖాతాల వివరాలను సమన్వయం చేసుకుని పూర్తి సమాచారం సేకరించాలని ఎల్‌డీఎం సిబ్బందిని ఆదేశించారు.జిల్లాలో మొత్తం 38 ప్రాజెక్టులకు అవగాహన ఒప్పందాలు కుదిరాయని, వాటిలో 24 ప్రాజెక్టులకు ఇప్పటికే జీవోలు జారీ అయ్యాయని తెలిపారు. 10 ప్రాజెక్టులకు పునాది రాళు వేయగా, మిగిలిన పరిశ్రమలు కూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్టులన్నింటికీ జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఉందో లేదో ఏపీఐఐసీతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

కన్స్ట్రక్షన్ రంగంలో పనిచేస్తున్న అన్ని శాఖలు తమ పరిధిలోని కాంట్రాక్టర్లు, ఏజెన్సీల పూర్తి వివరాలను కమర్షియల్ టాక్స్ శాఖకు అందించాలని ఆదేశించారు. జీఎస్టీ ఉన్నవారు, లేనివారు ఎంతమంది అన్నది స్పష్టంగా తెలియజేయాలన్నారు.డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు (డిడిఓ లు) అందరూ జీఎస్టీ-టీడీఎస్ కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, కాంట్రాక్టర్లు జీఎస్టీ చెల్లిస్తున్నారో లేదో పర్యవేక్షించాలని సూచించారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో కర్నూలు జిల్లా 11 శాతం వృద్ధితో రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచిందని తెలిపారు. రూ.778 కోట్ల లక్ష్యంలో 85 శాతం సాధించినట్లు వెల్లడించారు. జీఎస్టీ సంస్కరణలు, రేట్ల తగ్గింపు ఉన్నప్పటికీ జిల్లా మంచి పనితీరు కనబరిచిందన్నారు.

ఈ సమావేశంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డీటీసీ శాంతకుమారి, పరిశ్రమల శాఖ జీఎం అశోక్ కుమార్, డీఎస్ఓ రాజా రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్య పరిష్కరించిన టిడిపి నాయకులు




**మంత్రాలయం,ఏప్రిల్, (రిపబ్లిక్ న్యూస్ ):** మంత్రాల నియోజకవర్గ కేంద్రంలోని మంత్రాలయం రాఘవేంద్రపురంలో గత వారం రోజుల నుండి తీవ్ర నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడుతున్న కాంట్రాక్టర్ పట్టించుకోక పోవడంతో మంత్రాలయం తెలుగుదేశం టౌన్ అధ్యక్షులు వరదరాజులు దృష్టికి రావడంతో ఎంపిటిసి నక్కి వెంకటేష్,లు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఇంచార్జ్ ఉపేందర్ రెడ్డి లతో కలిసి పైప్ లైన్లు మరమ్మతులు చేయించారు. తాత్కాలికంగా సమస్యను పరిష్కరించినట్టు తెలిపారు. త్వరలోనే ఆర్ డబ్లు.యస్ ఉన్నత అధికారులతో కలసి,త్రాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

# కర్నూలులో గౌరి గోపాల్ హాస్పిటల్ లో

# మెగా ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

## మంత్రి టీ.జీ. భరత్ గుప్తా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విస్తృత వైద్య సేవలు







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 17)**
రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీ.జీ. భరత్ గుప్తా సౌజన్యంతో కర్నూలు నగరంలో మెగా ఉచిత వైద్య శిబిరం ప్రారంభమైంది. గౌరి గోపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ఈ శిబిరం ఏప్రిల్ 17 మరియు 18 తేదీలలో రెండు రోజుల పాటు కొనసాగనుంది.
ఈ కార్యక్రమానికి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు యాదవ్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
శిబిరంలో రక్తపరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ, ఫైబ్రో స్కాన్, కంటి పరీక్షలు, లివర్ పరీక్షలు వంటి పలు వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు.
కర్నూలు నియోజకవర్గ ప్రజల ఆరోగ్యంపై మంత్రి టీ.జీ. భరత్ గుప్తా నిరంతర శ్రద్ధ కొనసాగుతుందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను వినియోగించుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# మహిళ రిజర్వేషన్‌కు వైయస్ఆర్‌సీపీ తొలి అడుగు

## -విజయ మనోహరి

### స్థానిక సంస్థల్లో 50% రిజర్వేషన్, కేబినెట్‌లో మహిళలకు ప్రాధాన్యం మహిళ సాధికారతకు కట్టుబాటు



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 17)** మహిళల సాధికారత కోసం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రారంభం నుంచే కట్టుబడి పనిచేస్తోందని మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎస్.వి. విజయ మనోహరి తెలిపారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించే దిశగా వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు.అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేసి మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచిన ఘనత వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆమె అన్నారు. ఈ నిర్ణయం ద్వారా గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు మహిళలకు నాయకత్వ అవకాశాలు విస్తరించాయని వివరించారు.రాష్ట్ర కేబినెట్‌లో మహిళలకు ప్రాధాన్యతనిస్తూ డిప్యూటీ సీఎం పదవితో పాటు నలుగురు మహిళలకు మంత్రివర్గంలో చోటు కల్పించడం ద్వారా మహిళల పాత్రను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మహిళ రిజర్వేషన్ బిల్లుకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని స్పష్టం చేశారు.మహిళల అభివృద్ధి, సాధికారత కోసం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని విజయ మనోహరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ మాజీ కార్పొరేటర్లు రేణుక, సత్యనారాయణమ్మ, మునెమ్మ, అర్షియా ఫారహీన్, భారతి, మంగమ్మ, హేమలత, కమలా, కాంతమ్మ, లలితమ్మ, శైకున్, స్వర్ణలత, విజయలక్ష్మి, రామిజా బీ తదితరులు పాల్గొన్నారుం

# ప్రమాదకర రవాణాపై కర్నూలు పోలీసుల కఠిన చర్యలు

## గూడ్స్, బొలెరో, ట్రాలీ వాహనాల్లో ప్రయాణికుల రవాణా నిషేధం ఉల్లంఘనలకు పర్మిట్లు రద్దు హెచ్చరిక

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 17)**
ప్రమాదకరంగా ప్రయాణికులను తరలించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సరుకు రవాణా కోసం మాత్రమే వినియోగించాల్సిన గూడ్స్, బొలెరో, ట్రాలీ వాహనాల్లో ప్రయాణికులను తరలించడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, ఆయా వాహనాల పర్మిట్లు కూడా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు తమ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి వాహనాల్లో ప్రయాణించకూడదని సూచించారు.ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గూడ్స్, బొలెరో,



ట్రాలీ వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్న ఘటనలను గుర్తించి, వాటిపై చర్యలు చేపడుతున్నారు. తనిఖీలలో భాగంగా ప్రయాణికులు కూర్చోవడానికి ఏర్పాటు చేసిన మధ్య ఇనుప రేకులను పోలీసులు తొలగించారు.
ఈ ప్రత్యేక తనిఖీలలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా ప్రజల భద్రత కోసం ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.



# మహిళా బిల్లు ఎన్నికల జిమ్మిక్కే

## : మీసాల సుమలత విమర్శలు

### ఓట్ల కోసం బీజేపీ మైండ్ గేమ్ ఆడుతోంది మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలి ఆరోపణలు




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 17)**
ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఎన్నికల జిమ్మిక్కు మాత్రమేనని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం సాయంకాలం కర్నూలులోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.దేశంలో ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 33 శాతం మహిళా రిజర్వేషన్ పేరుతో ఓట్లు దక్కించుకునేందుకు బీజేపీ మైండ్ గేమ్ ఆడుతోందని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా ఏప్రిల్ 23న జరగనున్న పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు మరియు తమిళనాడు శాసనసభ ఎన్నికలు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ బిల్లును ముందుకు తెచ్చారని అన్నారు.మహిళా రిజర్వేషన్ బిల్లును బూచిగా చూపిస్తూ ఓట్లను రాబట్టే ప్రయత్నం జరుగుతోందని, ప్రధాని మోడీ ప్రజలను మోసం చేస్తున్నారని సుమలత విమర్శించారు. డిలిమిటేషన్ పేరుతో మహిళా చట్టాన్ని అమలు చేయడాన్ని ఆలస్యం చేసే కుట్ర జరుగుతోందని ఆమె పేర్కొన్నారు.
'నారీ శక్తి వందన్' చట్టం పేరుతో దేశ సమగ్రతపై పెద్ద దాడి జరుగుతోందని, ఎన్డీఏ ప్రభుత్వం రాజకీయ లాభాల కోసం ఇలాంటి చర్యలు తీసుకుంటోందని ఆమె ఆరోపించారు.
ఈ సమావేశంలో అక్తర్ బి, తహేరబి, ముంతాజ్, జాఫర్ బి, కర్రెమ్మ, నారాయణ, నాగన్న, కృష్ణ, పీటర్ తదితరులు పాల్గొన్నారు

# దేవనకొండ మండలంలోని పలు గ్రామాల్లో పోషణ పక్వడా కార్యక్రమాలు ఘనంగా నిర్వహణ







**దేవనకొండ ఏప్రిల్ 17 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
దేవనకొండ మండలంలోని పలు గ్రామాలలో పోషణ పక్వడా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడ్డాయి. బాలల ఆరోగ్యం, పోషణ మరియు మెదడు అభివృద్ధి పై తల్లులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది.దేవనకొండ 5వ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 0–2 సంవత్సరాల పిల్లల పోషణ, మెదడు అభివృద్ధి అంశాలపై తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శివలింగమ్మ, అంగన్వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, మహేశ్వరి పాల్గొని సూచనలు అందించారు. గర్భిణులు, బాలింతలు, 7 నెలల నుండి 6 సంవత్సరాల పిల్లల తల్లులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.అదే విధంగా ఆస్పరి ప్రాజెక్ట్ పరిధిలోని పాలకుర్తి గ్రామంలో కూడా పోషణ పక్వడా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు మరియు 0–3 సంవత్సరాల పిల్లల తల్లులకు సరైన ఆహారం, పిల్లల సంరక్షణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ మద్దమ్మ, సూపర్వైజర్ షాహినా బేగం, అంగన్వాడీ కార్యకర్త విమలమ్మ హాజరయ్యారు.ఇదే క్రమంలో ఈదులదేవరబండ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పిల్లల మెదడు అభివృద్ధికి ఆట ఆధారిత అభ్యాసం ఎంతో ముఖ్యమని వివరించారు. చిన్నారులకు మొబైల్ ఫోన్ల వినియోగం తగ్గించడం అవసరమని, బొమ్మలు తయారు చేయించడం, ఆటలు ఆడించడం ద్వారా శారీరక, మానసిక అభివృద్ధి సాధ్యమవుతుందని సూపర్వైజర్ చందన తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు మరియు తల్లులు పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్త జ్యోతి సమన్వయం చేశారు.
మొత్తంగా, ఈ పోషణ పక్వడా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో తల్లులలో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాయి. బాలల ఆరోగ్యం, పోషణ మరియు సమగ్ర అభివృద్ధి కోసం ఇటువంటి కార్యక్రమాలు కొనసాగాలని అధికారులు సూచించారు.

# గురువు డాక్టర్ సర్వేపల్లి జీవితం ఓ స్ఫూర్తి పాఠం

**ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన భారత ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధకృష్ణన్ 51వ వర్ధంతిని పురస్కరించుకొని!**
**బేతంచెర్ల ప్రతినిధి, ఏప్రిల్ 17,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



వృత్తిరీత్యా,వ్యక్తిత్వ రీత్యా,సంస్కార రీత్యా సర్వేపల్లి రాధాకృష్ణన్ మహోన్నతుడు.పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది,చిన్నతనం నుంచే అసాధారణ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించిన డాక్టర్ సర్వేపల్లి స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా,తన వృత్తి ధర్మానికి ఓ మకుటంగా వెలిగారు.గురువులకు గురువుగా ఉపాధ్యాయవృత్తికి ఆదర్శంగా నిలిచిన ఆయన ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ఓ తెలుగు కుటుంబంలో జన్మించారు.విద్యార్థికి,ఉపాధ్యాయునికి మధ్య సంబంధం ఎలా ఉండాలో విడమరచి చెప్పారు ఆచార్య రాధాకృష్ణ.ఆధ్యాపకుడిగా,వైస్ ఛాన్సలర్ గా, దౌత్యవేత్తగా,ఉపరాష్ట్రపతిగా,రాష్ట్రపతిగా ఆయన దేశానికి అందించిన సేవలు నిరుపమానం,అనితర సాధ్యం.ఆయన అధిరోహించిన శిఖరాలు ఆయన జీవితంలోని అసాధారణ కోణాలను మనకు వెల్లడి చేస్తాయి.ఇక ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచిన ఆచార్యులు,మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ .ముఖ్యంగా ఆయన తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణం.ఆయన పుట్టినరోజైన సెప్టెంబర్ 5న ఏటా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాము కూడా.ఏదిఏమైన నాలుగు దశాబ్దాల పాటు ఆయన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఉపాధ్యాయవృత్తి లోనే గడిపారు.ఎదుటి వారికి బోధించడం వల్ల తన విజ్ఞానం కూడా వృద్ధి చెందుతుందని మనసా,వాచ,కర్మనా నమ్మి ఆచరించిన వ్యక్తి ఈ సర్వేపల్లి రాధాకృష్ణన్.ప్రదానంగా కష్టమైన అంశాన్ని కూడా విద్యార్థులకు అతి సులభంగా బోధించే వారాయన, అంతేకాదు ఉపాధ్యాయుడి బాధ్యత ఎప్పుడు గురుతరమైనదే,అలాంటి భోదనా వృత్తికే తలమానికంగా నిలిచిన గొప్ప ఘన చరిత్ర ఈ సర్వేపల్లి రాధాకృష్ణన్ ది అనే మాట అక్షర సత్యం.ఏమైనా ఈ రోజు ఏప్రిల్ 17 ఆయన 51వ వర్ధంతిని పురస్కరించుకొని యావత్ ఉపాధ్యాయ వృత్తికే ఎనలేని వన్నె తెచ్చిన ఆ మహోన్నతునికి, కారణజన్మునికి ఈ ప్రత్యేక సందర్భంగా కోట్లాది మంది భారతీయులు మరియు ముఖ్యంగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ప్రతి ఒక్కరూ కూడా ఆ ఆదర్శ వ్యక్తికి అత్యంత గొప్పగా,ఘనంగా నివాళులు అర్పించాల్సిన తరుణం ఇదే.

# ఓర్వకల్లు లో రైతులపై పోలీసుల దౌర్జన్యం.

## రైతులకు రక్షణ కల్పించాలి, దౌర్జన్యం చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి.

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్.

**ఓర్వకల్లు ప్రతినిధి, ఏప్రిల్ 17,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం తిప్పాయపల్లె గ్రామంలో రైతుల వ్యవసాయ భూములలో రైతుల అనుమతి లేకుండా హై టెన్షన్ విద్యుత్ వైర్లు లాగటాన్ని రైతులు అభ్యంతరం పెట్టారు. తమ విలువైన భూములలో హైటెన్షన్ విద్యుత్తు వైర్లు లాగటం వల్ల తమ భూములకు విలువ కోల్పోతామని, వ్యవసాయానికి అవసరమైన బోర్లు వేసుకోలేమని, మామిడి, చీని వంటి ఉద్యాన పంటలు పెట్టుకునే అవకాశం ఉండదని కనుక తమ భూములలో హైటెన్షన్ విద్యుత్ వైర్ల లాగటాన్ని రైతులు అభ్యంతరం పెట్టారు.
ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ ఎస్సై సునీల్ కుమార్ తమ సిబ్బందితో వెళ్లి రైతులపై దౌర్జన్యం చేసి అక్రమంగా అరెస్టు చేసి ఓర్వకల్లు పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. హైటెన్షన్ విద్యుత్ వైర్లు లాగేందుకు విద్యుత్ కంపెనీకి అనుకూలంగా వ్యవహరించారు. రైతుల భూములలో రైతుల అనుమతి



లేకుండా హై టెన్షన్ విద్యుత్ వైర్లు లాగుతున్న కాంట్రాక్టర్, విద్యుత్ సంస్థపై చర్యలు తీసుకోవడం కాకుండా తమ భూముల విలువను కాపాడుకునేందుకు ప్రయత్నించిన రైతులపై పోలీసులు దౌర్జన్యం చేయటం ఏమిటని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ప్రశ్నిస్తున్నది. రైతులపై దౌర్జన్యం చేసిన ఓర్వకల్లు ఎస్సై మరియు సిబ్బందిపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుచున్నాము. కాంట్రాక్టర్లు, పోలీసుల నుండి రైతులకు రక్షణ కల్పించాలని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్ట పరిహారం చెల్లించిన తర్వాత మాత్రమే వ్యవసాయ భూములలో హై టెన్షన్ విద్యుత్ వైర్లు లాగాలని ప్రభుత్వాన్ని ప్రభుత్వ అధికారులను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.
రాజ్యాంగం కల్పించిన ఆస్తి హక్కును అమాయక రైతుల మీద పోలీసు ద్వారా హరించి వేసే ప్రయత్నం చేస్తున్న కాంట్రాక్టర్లను, విద్యుత్ కాంట్రాక్ట్ సంస్థ అధికారులను చట్టపరంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తున్నది. ప్రజలకు, రైతులకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ యంత్రాంగం కాంట్రాక్టర్ల పక్షం వహించడం ఇది ఏ రకమైన ప్రజాస్వామ్య పద్ధతితో పోలీస్ అధికారులు పరిశీలించాలని కోరుచున్నది. చట్టాన్ని ఉన్న వాళ్లకు చుట్టంగా మార్చిన ఓర్వకల్లు ఎస్సై ఇతర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. రైతులకు రక్షణ కల్పించాల్సిందిగా, న్యాయమైన పరిహారం ఇప్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కర్నూలు జిల్లా కలెక్టర్ ను మరియు ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

# ఘనంగా ఎంపీటీసీ జన్మదిన వేడుకలు

**మంత్రాలయం, ఏప్రిల్, 17,(రిపబ్లిక్ న్యూస్):** మంత్రాలయం నియోజకవర్గం ఎంపీటీసీ నక్కి వెంకటేష్ జన్మదిన వేడుకలు తెలుగుదేశం టౌన్ ఇంచార్జ్ వరరాజు,తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాన సంచాపెల్చి,కేకులు కట్ చేసే సంబరాలు జరుపుకున్నారు. ఎంపీటీసీకి శాలువాకప్పి పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నరసింహులు శివ,రఘు,యువత తదితరులు పాల్గొన్నారు.





# తాగుబోతు వీరంగం

## -బీర్ బాటిల్‌తో దాడి!

**తీవ్రంగా గాయపడ్డ పుచ్చకాయ వ్యాపారి -నార్పలలో ఉద్రిక్తతడ పరారీలో నిందితుడు**

**అనంతపురం/నార్పల క్రైమ్, ఏప్రిల్ 17, (రిపబ్లిక్ న్యూస్):**
మద్యం మత్తులో ఓ వ్యక్తి రెచ్చిపోయి ఓ వ్యాపారిపై దాడికి పాల్పడిన ఘటన నార్పల కేంద్రంలో కలకలం రేపింది. వైన్ షాప్ పక్కన పుచ్చకాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న బెస్త కుళ్లాయప్పపై ప్రతాప్ రెడ్డి బీర్ బాటిల్‌తో దారుణంగా దాడి చేయడం స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది.



గాయపడ్డ పుచ్చకాయ వ్యాపారి


**బాధితుని కథనం మేరకు**
నిత్యం లాగే పుచ్చకాయలు అమ్ముకుంటున్న కుళ్లాయప్ప వద్దకు ప్రతాప్ రెడ్డి మద్యం మత్తులో వచ్చి పుచ్చకాయ తిన్నాడు. అనంతరం డబ్బులు చెల్లించకుండా వెళ్లిపోతుండగా, "తిన్న వాటికి డబ్బులు ఇవ్వండి" అని కుళ్లాయప్ప అడగడంతో ప్రతాప్ రెడ్డి ఆగ్రహంతో ఊగిపోయాడు. విచక్షణ కోల్పోయిన అతడు చేతిలో ఉన్న బీర్ బాటిల్‌తో కుళ్లాయప్ప తలపై బలంగా కొట్టాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కుళ్లాయప్ప అక్కడికక్కడే స్పృహ కోల్పోయి పడిపోయాడు.
ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని ప్రతాప్ రెడ్డిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, అతడు అక్కడి నుంచి పారిపోయాడు. దాడిలో గాయపడిన కుళ్లాయప్పను 108 అంబులెన్స్ ద్వారా వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మితిమీరిన వేగం యువత పాలిట పెనుశాపంగా మారుతున్నది

**యువతకు వేగం ఆనందం ఇవ్వవచ్చునేమో గాని అది వారి ప్రాణాలను అనంత వాయువుల్లో కలిపివేస్తుంది**

**బుగ్గన మధుసూదనరెడ్డి,సామాజిక విశ్లేషకుడు,బేతంచెర్ల,నంద్యాల జిల్లా**

**బేతంచెర్ల ప్రతినిధి, ఏప్రిల్ 17,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఈ మధ్య కాలంలో యువత బైక్ లపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ అనేక ప్రమాదాలకు కేంద్రబిందువుగా నిలుస్తుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. ఉడుకు రక్తం నరనరాన ఉప్పొంగే యువతలో తాము బైక్ ను నడపడం అనేది ఎంత ప్రమాదకరమో, ఒక్కొక్కసారి అది తమ ప్రాణాల మీదకు తెస్తుంది అనే విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. ముఖ్యంగా (»Speed Thrills But Kills» ), అతివేగం అనర్థదాయకం వంటి బోర్డులను రాష్ట్రరవాణా శాఖ వారు ఎన్ని పెట్టిన వాటిని పెడచెవిన పెడుతూ యువత అత్యంత వాయు వేగం తో తమ మోటార్ బైక్ లను దౌడు తీయించడమే పనిగా పెట్టుకున్నారు. పైగా యువత ఒకే బైక్ పై ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ముగ్గురు ప్రయాణం చేస్తూ తమ ఇష్టం వచ్చిన రీతిలో బైక్ లలో కటింగులు కొడుతూ, సర్కస్ ఫీట్లు చేస్తూ అత్యంత వేగం తో ముందుకు దూసుకుపోతూ అటు వారి ప్రాణాలను ప్రమాదపు అంచుల్లోకి తీసుకుపోవడమే గాక ఇటు రోడ్డు మీద నడిచే పాదచారులను, వాహనాలపై ప్రయాణించే ఇతర వాహనదారుల ప్రాణాలను కూడా ప్రమాదం లోకి నెట్టి వేస్తుండటం కడు శోచనీయం. పోలీసు శాఖ వారు ఎంతో నిఘా పెట్టి ఈ యువత వేగానికి చెక్ పెట్టేలా వారి నుంచి




జరిమానాలు వసూలు చేస్తున్న వారిపై క్రమశిక్షణ చర్యలు ఎన్ని తీసుకుంటున్న పరిస్థితిలో పెద్దగా మార్పు కాన రావడం లేదు. అదేవిధంగా యువత తల్లిదండ్రులు సైతం తమ వంతుగా బైక్ లపై వేగంగా వెళ్లడం వల్ల ఎన్నో అనర్థాలు వున్నాయి అని పదే పదే హెచ్చరిస్తున్నప్పటికి అవి చెవిటోడి ముందు శంఖం ఉదినట్లు ఇలాంటి మాటలను సైతం భేఖాతార్ చేస్తూ యువత వేగంగా వెళ్లడమే తమ అభిమతం అనే మొండి వైఖరి తో ముందుకు వెళుతూ అనేక ప్రమాదాలను కొని తెచ్చుకుంటూ వారి తల్లిదండ్రులకు తీవ్ర ఆవేదనను, ఎనలేని గర్భ శోకాన్ని మిగుల్చుతున్నారు అనే మాట సత్య దూరం కాదు. ఏదిఏమైనా ఈ మితిమీరిన వేగం అనే విషనాగుకు, అత్యంత ఆనారోగ్యపు అలవాటుకు పాదాక్రాంతం, బానిస అవ్వడమే గాక, వేగంగా వెళ్లడం అనేది ఒక వెలంవెర్రిగా భావిస్తున్న యువత కోరి కోరి పులి బోనులో అడుగుపెట్టినట్లుగా వీరి జీవితాలను వీరే సర్వనాశనం చేసుకుంటున్నారు. ఏమైన ప్రతి ఏడాది దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ఏదో ఒక సందర్భంలో వేలాది మంది యువత ఈ అదుపు తప్పిన వేగం కారణంగా తమ విలువైన ప్రాణాలను మృత్యుకూపం లోకి నెట్టి వేసుకుంటుండటం అత్యంత దిగ్భ్రాంతికరం. ఇప్పటికైనా యువత తాము అంతకు తాముగా వివేకం తో వ్యవహరించి తమ వేగానికి ముకుతాడు వేయకపోతే, కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకొని ' నిదానమే ప్రదానం అనే పెద్దల నానుడికి కట్టుబడి యువత వ్యవహరిస్తే అది మీకు, ఈ సమాజానికి ఎంతో ఆరోగ్యకరం. కాబట్టి ' నేటి యువత రేపటి మన దేశ బంగారు భవిష్యత్ కు ఆశాకిరణాలు ' అనే అత్యంత ప్రధానమైన విషయాన్ని నేటి యువత ఎల్లవేళలా గుర్తు పెట్టుకొని మసలుకుంటూ మితిమీరిన వేగం అనే గుర్రానికి మీరు సంకెళ్లు వేయక తప్పదు. అలా చేస్తే అటు మిమ్మల్ని నమ్ముకున్న మీ తల్లిదండ్రులకు, ఇటు ఈ దేశానికి ఎంతో మేలుచేసిన వారవుతారు.

# ప్రకృతి వ్యవసాయంలో అర్ధ చంద్ర ఆకారం రైతుకు లాభం

**50 సెంట్ల భూమిలో 30 రకాల పంటలు -ప్రకృతి వ్యవసాయ ఎంటి రేవన్న, వ్యవసాయ అధికారి శ్రీరామ్ ప్రవీణ్**







**చిప్పగిరి, ఏప్రిల్ , 17,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం నగరడోన గ్రామంలో శుక్రవారం రైతు పుల్ల సావిత్రమ్మ పొలంలో 50 సెంట్ల భూమిలో 30 రకాల పంటలు ఎలా తయారు చేసుకోవాలి అని పకృతి వ్యవసాయ ఎంటి రేవన్న, అగ్రికల్చర్ ఏవో శ్రీరామ్ ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు, ప్రకృతి వ్యవసాయ ఎంటి రేవన్న మాట్లాడుతూ అర్థ వృత్తాకార గట్లు అనేది నీటి సంరక్షణ సమర్థవంతమైన పద్ధతి అని, వాలుగా ఉన్న భూమిలో వర్షపు నీరు వేగంగా కొట్టుకుపోకుండా ఆపి మొక్కల వేర్ల వద్దకు చేరేలా చేస్తుందని, ప్రకృతి వ్యవసాయంలో పంటలను సాగు చేయడం అనేది చాలా లాభదాయకమైన పద్ధతి అని, వర్షాదారి త ప్రాంతాల్లో విత్తనాలను రక్షించుకోవడానికి మరియు నేల సారాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని, 50 సెంట్లు భూమి విస్తీర్ణంలో కూడా 30 రకాల పంటలు వేయడం ద్వారా చీడపీడల వ్యాప్తి తగ్గుతుందని, మీ భూమి వాతావరణానికి అనుగుణంగా ఆకుకూరలు ,కూరగాయలు, పప్పు ధాన్యాలు, వంటి పండ్ల రకాలు ఎంచుకోవాలని కోరారు, ఏవో శ్రీరామ్ ప్రవీణ్ మాట్లాడుతూ రసాయానికి ఎరువులు తక్కువగా వాడాలని, సేంద్రియ ఎరువులు బాగా ఎక్కువగా ఉపయోగించాలని కోరారు, ఈ కార్యక్రమంలో వీఏఏ సాయి కృష్ణ, ఎన్ఎఫ్ఏ విద్యాసాగర్, డిఎల్ ఎం టి నాగమణి, ఐ సి ఆర్ పి లు రంగయ్య, రాజశేఖర్, శృతి, అరుణ ,శ్రీలత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# టిప్పర్ లారీ బోల్తా త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

**అవుకు ఏప్రిల్ 17( రిపబ్లిక్ న్యూస్)**
నంద్యాల జిల్లా అవుకు మండలం అవుకు గ్రామంలోని కొత్త కాలువ సమీపంలో శుక్రవారం ఒక టిప్పర్ లారీ బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. నంద్యాల నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న ఈ లారీని అవుకు మనోహర్ (25) అనే డ్రైవర్ నడుపుతున్నట్లు సమాచారం.




అతివేగంగా వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించేందుకు ప్రయత్నించిన డ్రైవర్ లారీపై నియంత్రణ కోల్పోవడంతో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గత కొన్ని రోజుల క్రితం కూడా ఇదే విధంగానే కంటైనర్ లారీ బోల్తాపడడం జరిగింది కావున అధికారులు స్పందించి ఈ విధంగా మళ్లీ మళ్లీ జరగకుండా టర్నింగ్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ ని నిర్మించాలని స్థానికులు గ్రామ ప్రజలు కోరుతున్నారు
సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ం

# రూరల్ డిఎస్పీగా టి. శ్రీనివాసులు బాధ్యతలు

## కాలనీ వాసుల ఘన సత్కారం

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 17, (రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం రూరల్ నూతన డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన టి. శ్రీనివాసులకు స్థానిక ప్రజలు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాచానపల్లి పంచాయతీకి చెందిన ఎడపల్లి మంజు ఆధ్వర్యంలో బి.ఎన్.ఆర్ కాలనీ వాసులు ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించి నూతన డిఎస్పీని అభినందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కలిసి టి. శ్రీనివాసులను శాలువాతో సత్కరించి, డైరీ, పెన్‌ను బహుకరించారు. స్థానికంగా పోలీసు సేవలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ, ఆయన సేవలు ప్రజలకు ఉపయోగపడాలని కోరుకున్నారు.



ఈ కార్యక్రమంలో బి. ఈశ్వర్ రెడ్డి, కుమ్మర నలప్ప, స్టూడియో రాము, మఠం స్వామి తదితరులు పాల్గొని నూతన డిఎస్పీకి తమ శుభాకాంక్షలు తెలిపారు.
పోలీసు శాఖపై ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో తన వంతు కృషి చేస్తానని టి. శ్రీనివాసులు హామీ ఇచ్చారు.

# పోషకాహార లోపం - తల్లీ పిల్లలకు శాపం

## ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి

**అనంతపురం సంక్షేమం, ఏప్రిల్ 17, (రిపబ్లిక్ న్యూస్):**
పోషకాహార లోపం ప్రాణాంతకమని ఐసీడీఎస్ అనంతపురం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు, తల్లుల్లో పోషకాహార లోపాన్ని అరికట్టినప్పుడే ఆరోగ్యకర సమాజాన్ని చూడగలమని ఆమె పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ ప్రాజెక్ట్ పరిధి మొదటి సెక్టార్లోని ఇందిరాగాంధీ నగర్ లో ఐసీడీఎస్ సూపర్వైజర్ కే. హేమలత ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ అనూరాధ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



**పోషకాహార లోపం ఒక తరం నుంచి మరో తరానికి కొనసాగే ప్రమాదం**
ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలనుద్దేశించి పీడీ శ్రీదేవి మాట్లాడారు. పోషకాహార లోపం అనేది కేవలం వ్యక్తులపైనే కాకుండా రాబోయే తరాల ఆరోగ్యం, అభ్యసనా సామర్థ్యం, ఉత్పాదకతపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. పోషకాహార లోపం ప్రభావం ఐదేళ్లలోపు పిల్లలు, తల్లుల మరణాల రేటుపై కూడా ఉంటుందన్నారు. శారీరక, మానసిక ఎదుగుదల కుంటుపడుతుందని పేర్కొన్నారు. పేదరికం, పోషకాహార లోపం ఒక తరం నుంచి మరో తరానికి కొనసాగే ప్రమాదముందని హెచ్చరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలు, మహిళల్లో పోషకాహార స్థితిని మెరుగుపరచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పోషణ అందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

**అభివృద్ధి చెందడానికి పోషకాలు అవసరం**
సాంకేతికత, సమన్వయంతో పిల్లలు, కౌమార దశలోని వారు, గర్భిణులు, పాలిచ్చే తల్లుల పోషకాహార ఫలితాలు మెరుగుపరచాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని అభిప్రాయపడ్డారు. పోషకాహార లోపంతో అనేక సమస్యలు వెంటాడుతాయన్నారు. ముఖ్యంగా ఎదగడానికి, నేర్చుకోవడానికి, అభివృద్ధి చెందడానికి అవసరమైన పోషకాలు చాలా అవసరమవుతాయని స్పష్టం చేశారు. ముందుగా అందుబాటులో చౌకగా దొరికే పోషకాహార పదార్థాల గురించి వివరించారు. అనంతరం తల్లులు, పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు యశోద, రామాంజనమ్మ, నారాయణమ్మ, పర్వీన్, ఆయాలు పాల్గొన్నారు.

# చైన్ స్నాచర్ అరెస్ట్

## - 20 గ్రాముల గోల్డ్ చైన్ స్వాధీనం

**బేతంచెర్ల ప్రతినిధి,ఏప్రిల్ 17,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
చైన్స్ స్నాచర్ చింతకాయల సుబ్రహ్మణ్యం ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై రమేష్ బాబు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.
31/03/2026 వ తేదీ మధ్యాహ్నం బేతంచర్ల టౌన్, పాత బస్టాండ్ సమీపంలో ఉన్న మద్దెల పరిమళ ఇంట్లోకి దూరి, ఆమె మెడలో ఉన్న 20 గ్రాముల బంగారు చైన్ ను తెంచుకొనిపోయిన కేసులో ముద్దాయి అయిన చింతకాయల సుబ్రమణ్యం, వయస్సు : 34 సం., గా/శీ నాగేశ్వర రావు, గౌరి పేట, బేతంచర్ల టౌన్ అను వ్యక్తిని ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆర్చ్ వద్ద నేడు మధ్యాహ్నం 12 గంటలకు గా× రమేష్ బాబు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి 20 గ్రాముల బంగారు చైన్ ను స్వాధీనం చేసుకొని, ముద్దాయి ను రిమాండ్ కు పంపడమైనది.




ఈ కేసులో క్లూస్ సేకరించి, ముద్దాయి ని త్వరితగతిన పట్టుకొని బంగారు సొత్తు ను రికవరీ చేసిన గా× రమేష్ బాబు, క్రైమ్ పార్టీరాజ లు అయిన గురు బాబు, రాజు నాయక్, సూర్య రామ రాజు, రైటర్ గిరి, సురేష్ లను ఋూ, డోన్ శ్రీనివాస్ వారిని అభినందించారు

# గంగమ్మ విగ్రహం ధ్వంసం ఘటనలో నిందితుడికి రిమాండ్.

**ఓబులవారిపల్లి ఏప్రిల్ 17 రిపబ్లిక్ న్యూస్.**
పుల్లంపేట మండలం అప్పయ్యరాజుపేటలోని పెరియవరం గ్రామంలో గంగమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనలో ఎద్దుల మల్లికార్జున అనే వ్యక్తిపై పుల్లంపేట పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి శుక్రవారం అతన్ని రాజంపేట జె ఎఫ్ సి ఎం కోర్టు ముందు హాజరు పరచడం జరిగినదని పుల్లంపేట సబ్ ఇన్స్పెక్టర్ చిన్న రెడ్డప్ప అన్నారు, నిందితుడి వయసు 40 సంవత్సరాలు ఉంటుందని అన్నారు కోర్టు అతనికి 14 రోజుల రిమాండ్




విధించిందని ఆయన అన్నారు, అదేవిధంగా గురువారం పెనగలూరు మండల పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులపై తిరగబడిన లంకయ్యగారి హరికృష్ణ అనే రౌడీ షీటర్‌పై కేసు నమోదు చేసి, అతన్ని కూడా కోర్టు ముందు హాజరు పరచినట్లు పెనగలూరు సబ్ ఇన్స్పెక్టర్ రఘురాం అన్నారు , కోర్టు అతనికి కూడా 14 రోజుల రిమాండ్ విధించారన్నారు అతను వయసు 24 సంవత్సరాల అని పోలీసులు తెలిపారు ,జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ,ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారిపై ,విధుల్లో ఉన్న పోలీసులకుఅంతరాయం కలిగించే వ్యక్తులపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, నిరంతరంఈ ప్రక్రియ కొనసాగుతుందని పోలీసులు హెచ్చరించారు.

# జెపి ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దురహంకారపూరితం

**రెండు రాష్ట్రాల ప్రజలకు బిజెపి బహిరంగ క్షమాపణ చెప్పాలి**

**సిపిఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం యాదగిరి డిమాండ్**



**ఆందోల్ ప్రతినిధి ఏప్రిల్ 17( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** పార్లమెంటు సాక్షిగా బిజెపి ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, భారత దేశ విభజనతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలను సిపిఎం సంగారెడ్డి ఏరియా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. బ్రిటిష్ వారు భారతదేశాన్ని, పాకిస్తాన్‌ను విడగొట్టిన పద్ధతిలోనే ఆంధ్ర-తెలంగాణ విభజన జరిగిందని తేజస్వీ సూర్య మాట్లాడటం ఆయన అజ్ఞానానికి, తెలుగు ప్రజల పట్ల ఉన్న చులకన భావానికి నిదర్శనం. దశాబ్దాల పోరాటాలు, వందలాది మంది బలిదానాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను ఒక దేశ విభజన నాటి రక్తపాతంతో పోల్చడం అత్యంత హేయం.

ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం, యాదగిరి మాట్లాడుతూ ఒకవైపు తామే తెలంగాణ ఇచ్చామని, ఇక్కడ 'విమోచన దినోత్సవాలు' జరుపుకుంటామని చెప్పుకునే బిజెపి నాయకులు పార్లమెంటులో మాత్రం రాష్ట్ర ఏర్పాటును అవమానపరిచేలా మాట్లాడటం వారి రెండు నాలుకల ధోరణికి నిదర్శనం. నాడు బిల్లుకు మద్దతు పలికిన వెంకయ్య నాయుడు, సుష్మా స్వరాజ్ వంటి నేతల నిర్ణయాలను ఇప్పుడు తేజస్వీ సూర్య తప్పుబడుతున్నారా? మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వంటి కీలక అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు, దక్షిణాది రాష్ట్రాల హక్కుల గురించి మాట్లాడకుండా.. ఇలాంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం ద్వారా చర్చను పక్కదారి పట్టించాలని బిజెపి చూస్తోంది. కేంద్ర మంత్రులుగా ఉన్న తెలంగాణ బిజెపి నేతలు తమ పార్టీ ఎంపీ రాష్ట్రాన్ని అవమానిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు? రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కూడా ఈ వ్యాఖ్యలను సమర్థించేలా మాట్లాడటం సిగ్గుచేటు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, తెలుగు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోంది. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నాం.

# పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్ జిల్లా ప్రతిని ధి ఏప్రిల్ 17 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలని.ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్ గా వ్యవహరిం. చాలని. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో సర్పంచులు ,పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగం పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో 15 వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా వినియోగించి గ్రామా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు మోడల్ గా తీర్చిదిద్దాలని, గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు, అంగన్వాడీ బిల్డింగ్స్, జిపి బిల్డింగ్స్ లేని గ్రామాలకు నూతన బిల్డింగ్స్ ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రత్యేక అధికారి, పంచాయతీ సెక్రెటరీ సర్పంచ్ సమన్వయంతో గ్రామ పంచాయతీలో పనులు సవ్యంగా నడవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని 15 ఆర్థిక సంఘం నిధులను అన్ని గ్రామాలకు ప్రభుత్వం అందించిందని ,వాటితో గ్రామాల్లో సమస్యలు లేకుండా ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. నిధుల వినియోగం లో అక్రమాలకు తావులేదన్నారు. నిధులు సక్రమంగా వినియోగించక పోతే ,అక్రమాలు జరిగితే సర్పంచ్ , కార్యదర్శుల పై చర్యలకు వెనకాడబోమని హెచ్చరించారు. గ్రామాల్లో త్రాగు నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డిఎల్పిఓలుసాయి బాబు, తిరుపతి రెడ్డి ,అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అందోల్ నియోజకవర్గానికి సింగూర్ నీటి విడుదల చేయాలి

**మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ విజ్ఞప్తి**





**అందోల్ ప్రతినిధి ఏప్రిల్ 17( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** అందోల్ నియోజకవర్గంలోని రైతుల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సింగూర్ ప్రాజెక్టు నుండి నీటి అసమాన పంపిణీ కారణంగా అందోల్ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

గత రెండున్నర సంవత్సరాలుగా లెఫ్ట్ కాలువ ద్వారా ఒక్క చుక్క నీరు కూడా విడుదల కాలేదని, మరోవైపు దిగువ ప్రాంతాలు మరియు ఘనాపూర్ ఆయకట్టు ప్రాంతాలకు మాత్రం నీరు అందుతున్నదని తెలిపారు. సింగూర్ డ్యామ్‌లో తగినంత నీరు ఉన్నప్పటికీ "రిపేర్ పనులు" పేరుతో ఆలస్యం జరుగుతుండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కారణంగా పుల్కల్, అందోల్ మండలాల్లోని విస్తారమైన సాగుభూములు నీటి లేమితో నిర్జీవంగా మారుతున్నాయని చెప్పారు. రెండు యాసంగి సీజన్లలో అనేక మంది రైతులు పంటలు వేయకుండా భూములను పాడుబడినట్టే ఉంచాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

అలాగే ఇటీవల సింగూర్ డ్యామ్ ఖాళీ చేసే సమయంలో ముందస్తు సమాచారం లేకుండా నీరు విడుదల చేయడంతో పోచారం, ముద్దాయిపేట్, పుల్కల్, మిమ్మూర్, ఈసాజీపేట్, గంగోజిపేట్ వంటి గ్రామాల్లో వరదలు సంభవించి వందల ఎకరాల పంటలు మునిగిపోయాయని తెలిపారు. అయినప్పటికీ బాధిత రైతులకు ఇప్పటివరకు పరిహారం అందలేదని విమర్శించారు.

ప్రభుత్వానికి సూచనలు:

రైతులకు "క్రాప్ హాలిడే" లేదా సరైన పరిహారం అందించాలి

కాలువ, డ్యామ్ మరమ్మతు పనులను వేగవంతం చేయాలి

వచ్చే సీజన్ నుంచి అందోల్ ప్రాంతానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి

నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించాలి

రైతుల సమస్యలను త్వరగా పరిష్కరించి వారికి ఉపశమనం కలిగించాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ కలెక్టర్‌ను కోరారు.

# హత్నూర మండలం కొన్యాల గ్రామంలో లో ఉద్రిక్తత

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఫ్లెక్సీల చింపివేతపై ఆగ్రహం**

**ఈ యొక్క సమస్యపై వెంటనే పోలీస్ సిబ్బంది చర్య తీసుకోవాలని**

**బి.ఆర్.ఎస్ నాయకుల డిమాండ్**






**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 17 రిపబ్లిక్ న్యూస్** హత్నూర మండలం.కొన్యాల, గ్రామంలో,బరితెగించిన దుండగులు: అర్ధరాత్రి వేళ నర్సాపూర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి ఫ్లెక్సీలు ధ్వంసం.

కక్ష సాధింపు రాజకీయాలు: హత్నూర మండల బిఆర్ఎస్ శ్రేణుల తీవ్ర నిరసన. వ్యక్తం చేశారు

నిందితులను వదలొద్దు ఆ యొక్క చౌరస్తలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తుల డిమాండ్. చేశారు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని హత్నూర మండలం కొన్యాల గ్రామంలో రాజకీయ సెగ రాజుకుంది. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, మాజీ మంత్రి శ్రీమతి వాకిటి సునీతా లక్ష్మారెడ్డి గారి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని దుండగులు చింపివేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.

వివరాల్లోకి వెళ్తే:

ఏప్రిల్ 5న సునీతా లక్ష్మారెడ్డి గారి జన్మదినం సందర్భంగా కొన్యాల గ్రామ ప్రధాన కూడళ్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే, ఏప్రిల్ 16వ తేదీ గురువారం అర్ధరాత్రి సమయంలో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఫ్లెక్సీలను బ్లేడ్లతో ముక్కలు ముక్కలుగా చింపివేసి పడేశారు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన పార్టీ శ్రేణులు షాక్‌కు గురయ్యారు.

**అభిమానుల ఆగ్రహం:**

కొన్యల గ్రామంలో ఎంతో గౌరవప్రదంగా ఉండే నాయకురాలి ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని స్థానిక నేతలు ఆరోపిస్తున్నారు. "అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇలాంటి చిల్లర పనులకు పాల్పడుతున్నారు" అని కార్యకర్తలు మండిపడ్డారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు.ప్రస్తుతం గ్రామంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. శాంతియుతంగా ఉండే కొన్యాల గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కొన్యాల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రీకాంత్ రెడ్డి, పలంచ సుధాకర్, బేగారి,అనంతరావు మాజీ , సర్పంచ్, కంది,ప్రభు, బి ఆర్ ఎస్ యువ నాయకులు కార్రోల్ల,గంగారం తదితర నాయకులు,స్థానిక ఎస్సై ,శ్రీధర్ రెడ్డి,కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# కుప్పంలో అక్రమ రవాణా పై పోలీసులు ఉక్కుపాదం








**కుప్పం రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 17** కుప్పం పరిధిలో అక్రమంగా గ్రానైట్ మరియు ఇసుక రవాణాపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టి, సరైన పత్రాలు లేని ఒక లారీతో పాటు రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.లి

జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి, ఖ్రూ గారి ఆదేశాల మేరకు, అక్రమ రవాణా మరియు మైనింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఈ తనిఖీలలో భాగంగా ఎటువంటి చట్టబద్ధ పత్రాలు లేకుండా గ్రానైట్ తరలిస్తున్న లారీని గుర్తించి సీజ్ చేయడంతో పాటు, అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా కుప్పం డిఎస్పీ శ్రీ పార్థసారధి గారు మాట్లాడుతూ, ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసి, అనేక కేసులు నమోదు చేసినప్పటికీ కొంతమంది ఇంకా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ కార్యకలాపాలు కొంత మేర తగ్గినప్పటికీ, అప్పుడప్పుడు ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.అలాగే కృత్రిమ ఇసుక తయారీపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామని, ఇటువంటి కార్యకలాపాలు గుర్తించిన చోట్ల విద్యుత్ సరఫరాను నిలిపివేయడానికి రెవెన్యూ శాఖతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు.ఈ ఘటనలో సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రజలు ఇటువంటి అక్రమ మైనింగ్, రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# దారి చూపిన వెలుగు రేఖ దేశ ఉప ప్రధాని



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 17 రిపబ్లిక్ న్యూస్** సంగారెడ్డి జిల్లా, జాహిరాబాద్ పట్టణంలో ప్రతిభ హై స్కూల్ శివాయలం చౌరస్తా లో గల బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ప్రతిష్టించిన సందర్భంగా అబ్రహం మాదిగ గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది,ఇట్టి కార్యక్రమానికి ముఖ్యులు సంగారెడ్డి జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ & విజిలెన్స్ కమిటీ మెంబర్లు కాశపాగ ఇమ్మయ్య,బంటు రామకృష్ణ, బాబూ జగ్జీవన్ రామ్ సమతా సంఘం జిల్లా కార్యదర్శి ఎల్. వేణుగోపాల్, దీపక్ రాజ్ 19వ వార్డు కౌన్సిలర్ గార్లు మాట్లాడుతు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ప్రభుత్వ భూమిలోస్వాతంత్ర సమరయోధుడు ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ గారి విగ్రహం ఏర్పాటు చెయడానికి స్థానిక శాసనసభ్యులు మరియు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని వారు కోరారు, పట్టణంలో బాగారెడ్డి పల్లి కి కేటాయించిన ప్రభుత్వ భూమి లో బాపు గారి విగ్రహా ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉపప్రధాని గా అన్నివర్గాల మెప్పుపోశీది దేశానికి నిస్వర్థంగా సేవలశీధిచిన గొప్ప నాయకులు బాపూజి గారు,బాబు జగ్జీవన్ రామ్ గారి విగ్రహం ఏర్పాటును అడ్డుకుంటున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు కోరారు బాబు జగ్జీవన్ రామ్ గారు ముపై సంవత్సరాలుగా 1946లో జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా,కార్మిక, సమాచార, రవాణా, రైల్వే, ఆహార, వ్యవసాయ మరియు రక్షణ శాఖమంత్రిగా, 1971లో జరిగిన భారత-పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రిగా ఉండి, బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. 1936 నుండి 1986 (మరణించే వరకు) సుమారు 50 ఏళ్ల పాటు నిరంతరాయంగా పార్లమెంటు సభ్యునిగా (ఎంమ్మెల్యే /ఎంపీ) రికార్డు సృష్టించారు.

మూడు దశబ్దాలుగా కేంద్ర మంత్రి గా కీలకమైనా చట్టాలను రూపొదించుటలో అయన ప్రత్యేక పాత్ర పోషించిన ఘనత ఆయనది, అందరికి స్ఫూర్తి ప్రదాత, మహనీయులు బాబు జాగ్జీవన్ రాం గారు అని గుర్తుచేశారు.ఇట్టి కార్యక్రమంలో... యువరాజ్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ మీడియా కోఆర్డినేటర్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి ఉల్లాస్ మాదిగ, ఎమ్మెస్ పి జిల్లా అధ్యక్షులు జైరాజ్ మాదిగ, రవీందర్ చౌహాన్ , బండి మోహన్ బి ఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గం ఇన్చార్జ్, శివప్ప ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు టిఆర్ఎస్ పార్టీ, టిఆర్ఎస్వి నియోజకవర్గ ఇన్చార్జ్ రాకేష్, టేకుమట్ల గణేష్ హోలీయ దాసరి సంఘం, యుదా,శివప్ప, ప్రణయ్, డేవిడ్,కిట్టు, అజయ్, లు పాల్గొన్నారు

## పీఎం అజయ్ యోజన ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం



**గుత్తి ఏప్రిల్ 17 (రిపబ్లిక్ న్యూస్)** గుత్తి పట్టణం ఎంపీడీవో కార్యాలయం నందు శుక్రవారం పీఎం అంజన్ యోజన పథకం కార్యక్రమానికి ముఖ్య అతిథులు స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు పాల్గొని పీఎం అంజన్ యోజన పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ మహిళా సంఘాలకు 9 మంది మహిళలకు 50,000 రూపాయలు సబ్సిడీ లోన్ పత్రాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆదుకునే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెలియజేశారు. మహిళలు మాట్లాడుతూ మా మహిళలకు అనేక అవకాశాలు కల్పించినటువంటి కూటమి ప్రభుత్వాని కి ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రతాప్ పట్టణ అధ్యక్షులు ఎంకే చౌదరి మండల అధ్యక్షుడు లక్ష్మి రంగయ్య ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు రాజా రమేష్ రామలింగమయ్య కోనంకి కృష్ణ చిదంబర శ్రీనివాసులు శ్రీనివాస్ చౌదరి వీరాంజనేయులు రవి రామానాయుడు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం

**నిందితురాలికి రెండేళ్ల జైలు శిక్ష -రూ.500 జరిమానా విధించిన కోర్టు**

**రిపబ్లిక్ క్రైమ్ , ఏప్రిల్ 17, కడప**కారుణ్య నియామకం కోసం నకిలీ విద్యాసర్టిఫికెట్లు సమర్పించి న్యాయస్థానాన్ని మోసం చేయాలని యత్నించిన యువతికి కోర్టు గట్టి శిక్ష విధించింది. కడపలోని మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నిందితురాలికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.కడప జిల్లా కోర్టులో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం. వెంకట నరసయ్య అందజేసిన నివేదికతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. చిన్న చౌక్‌కు చెందిన కుమారి దీపిక తన తల్లి మరణానంతరం కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకుంటూ సమర్పించిన ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్లు నకిలీవని ఇంటెలిజెన్స్ విచారణలో తేలింది.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితురాలు తప్పుడు ధృవపత్రాలతో ఉద్యోగం పొందేందుకు ప్రయత్నించినట్లు స్పష్టమైంది. విచారణ అనంతరం చార్జ్‌షీట్ దాఖలు చేయగా, కోర్టులో జరిగిన విచారణలో ఆరోపణలు రుజువయ్యాయి. దీంతో న్యాయమూర్తి ఎం. రేష్మ కేసును విచారించి నిందితురాలికి రెండేళ్ల కారాగార శిక్షతో పాటు జరిమానా విధించారు. ప్రభుత్వ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. శ్యామ్ సుందర్ రెడ్డి వాదనలు వినిపించగా, అప్పటి ఎస్ఐ హుస్సేన్ కేసును నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను సమర్పించడంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ చిన్న పెద్దయ్య, కోర్టు కానిస్టేబుల్ మహేష్ కుమార్ కీలక పాత్ర పోషించారు.

పోలీసుల హెచ్చరిక : నకిలీ సర్టిఫికెట్లు ఉపయోగించి ఉద్యోగాలు పొందేందుకు ప్రయత్నించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని పోలీసు శాఖ హెచ్చరించింది.

ప్రజా రిపబ్లిక్



# జలధార కార్యక్రమంతో భూగర్భ జలాల పెంపు లక్ష్యం

**నీటి వనరుల సమర్ధ వినియోగంపై కలెక్టర్ దిశానిర్దేశం**

**జిల్లాలో నీటి సంక్షోభ నివారణకు ప్రత్యేక చర్యలు**


**మండలాల వారీగా జలవనరుల సమగ్ర గణాంకాల సేకరణ**

**కాస్కేడ్ సిస్టమ్‌తో చెరువుల అనుసంధానం**

**డోన్, ప్యాపిలి మండలాల్లో నీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి**

**గ్రామ స్థాయిలో జల సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 17 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో 100 రోజుల 'జలధార' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు సమిష్టిగా అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన 'జలధార' కార్యక్రమానికి సంబంధించిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొని ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు సంబంధిత శాఖల అధికారులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సమర్ధ వినియోగం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యల నివారణ లక్ష్యాలుగా తీసుకుని100 రోజుల 'జలధార' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి అధికారి తమ పరిధిలో ప్రణాళికాబద్ధంగా పని చేసి స్పష్టమైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. జిల్లాలోని 30 మండలాల్లో 11 మండలాలు నీటి నిల్వ విషయంలో క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వర్షాల అనంతరం భూగర్భ జలాల మట్టం 3 మీటర్ల లోపల, వర్షాలకు ముందు 8 మీటర్ల లోపల ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి ఆ మేరకు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. కృష్ణా నది జిల్లాలోకి ప్రవేశించిన తర్వాత శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్, తెలుగు గంగ, కెనాల్, కేసీ కెనాల్‌లుగా విభజించి సుమారు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు వివరించారు. అయితే డోన్ మండలంలోని కొచ్చెరువు ప్రాంతంలో భూగర్భ జలాలు సుమారు 45 మీటర్ల లోతులో ఉన్నాయని, జిల్లాలోని 165 గ్రామాల్లో నీటి మట్టం 20 మీటర్ల కంటే ఎక్కువ లోతులోకి పడిపోయిందని చెప్పారు. డోన్, ప్యాపిలి మండలాల్లో నీటి ఎద్దడి అధికంగా ఉందని తెలిపారు. ప్రతి మండలానికి సంబంధించిన భూగర్భ జలాల గణాంకాలను సిద్ధం చేయాలని, గ్రామ మరియు మండలాల వారీగా నీటి మట్టం వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువులు, కుంటలు తదితర నీటి వనరులపై పూర్తి వివరాలతో నివేదిక తయారు చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న 330 మైనర్ ఇరిగేషన్ చెరువుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని చెప్పారు. నీటి వనరులు నిండే విధానాలపై అవగాహన కల్పిస్తూ, వర్షపాతం, మేజర్ కెనాల్స్ ద్వారా నీటి మళ్లింపు, సహజ ప్రవాహాల ద్వారా నీటి చేరిక వంటి అంశాలలో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని చెరువులు నిండడం కొన్ని కెనాల్స్ ద్వారా, మరికొన్ని సహజ ప్రవాహాల ద్వారా, మిగిలినవి పూర్తిగా వర్షాలపై ఆధారపడుతున్నాయని పేర్కొన్నారు. 'కాస్కేడ్ సిస్టమ్' ప్రాముఖ్యతను వివరిస్తూ, ఒక చెరువు నిండిన తరువాత అదనపు నీరు వరుసగా ఇతర చెరువులకు చేరే విధానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 27 కాస్కేడ్లలో మొత్తం 86 ట్యాంకులు ఉన్నట్లు తెలిపారు. భూగర్భ జలాల పెంపు కోసం ఫామ్ పాండ్స్, చెక్ డ్యామ్స్, రాక్ ఫిల్ డ్యామ్స్, కాంటూర్ ట్రెంచెస్ వంటి నిర్మాణాలను గుర్తించి, వాటి స్థితిగతులను అంచనా వేసి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో భూగర్భ జలాల మట్టం, మండల సగటు, ప్రస్తుత నీటి వనరుల నిర్మాణాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చెరువుల స్థితి, ఫీడర్ ఛానల్స్ పరిస్థితి, సహజ నీటి ప్రవాహాలపై పరిశీలన జరిపి చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామస్తుల భాగస్వామ్యంతో నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని, ఎండకాలంలో కూడా నీటి నిల్వ ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా భౌగోళికంగా కృష్ణా, పెన్నా బేసిన్లలో విస్తరించి ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందులో సుమారు 75% కృష్ణా బేసిన్‌లో, 25% పెన్నా బేసిన్‌లో ఉందన్నారు. తుంగభద్ర బేసిన్ కృష్ణా పరిధిలో భాగం కాగా, నందికొట్కూరు తుంగభద్రలో, ఆళ్లగడ్డ పెన్నా బేసిన్‌లోకి వస్తాయన్నారు. పెన్నా బేసిన్‌లో కుందేరు నది ముఖ్య ఉపబేసిన్ అని, జిల్లాలో నీటి నిల్వల కొరత వల్ల వరదనీరు వృథాగా ఇతర జిల్లాలకు వెళ్లుతోందని కలెక్టర్ వివరించారు. ఈ వర్క్ షాప్ లో జల వనరుల శాఖ ఎస్ఈ శివశంకర్ రెడ్డి, భూగర్భ జల అధికారి రఘురాం, డ్వామా పీడీ సూర్యనారాయణ, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ నాగరాజు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'హోం' కోసం
# హోంగార్డుల పోరాటం

## విభజన గాయం ఇంకా మానలేదా?

**రాష్ట్రాలు విడిపోయినా జీవితాలు మాత్రం మధ్యలోనేడ బదిలీలు లేక కుటుంబాల నుంచి దూరమైన వందలాది మంది హోంగార్డులు**




**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 17)**
రాష్ట్ర విభజన అనేది పరిపాలనా నిర్ణయం మాత్రమే అయినప్పటికీ, దాని ప్రభావం ఇంకా కొన్ని వర్గాల జీవితాలను తీవ్రంగా తాకుతూనే ఉంది. అందులో ముఖ్యంగా పోలీసు శాఖలో సేవలందించే హోంగార్డుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు కష్టపడే ఈ సిబ్బంది, తమ వ్యక్తిగత జీవితాల్లో మాత్రం అనిశ్చితి, అస్థిరతతో పోరాడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత సుమారు పదమూడు సంవత్సరాలు గడిచినా, స్థానికేతర హోంగార్డుల బదిలీ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాని దీర్ఘకాలిక సమస్యగా మిగిలింది. తెలంగాణకు చెందిన హోంగార్డులు ఆంధ్రప్రదేశ్‌లో, ఆంధ్రకు చెందినవారు తెలంగాణలో విధులు నిర్వర్తిస్తూడ "ఇది మా పని ప్రదేశం కాదు, మా ఇల్లు కూడా కాదు" అనే విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

### విధులు ఒకచోట జీవితం మరోచోట

హోంగార్డుల జీవితంలో ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదు, మానవీయ సంక్షోభంగా మారింది. చాలా మంది తమ కుటుంబాలను స్వగ్రామాల్లోనే ఉంచి, తాము వేరే రాష్ట్రాల్లో డ్యూటీలు చేస్తున్నారు. పిల్లల చదువు, పెద్దల ఆరోగ్యం, కుటుంబ అవసరాలు ఇవన్నీ దూరం నుంచే చూసుకోవాల్సి వస్తోంది. నెలలో కొన్ని రోజులు మాత్రమే ఇంటి ముఖం చూసే పరిస్థితి ఏర్పడింది.

### మానసిక ఒత్తిడి ఆర్థిక ఇబ్బందులు

హోంగార్డుల వేతనాలు స్వల్పంగా ఉండటంతో, రెండు చోట్ల జీవన వ్యయం భరించడం మరింత కష్టంగా మారింది. ఒకచోట వసతి, మరొకచోట కుటుంబ ఖర్చులుఇవి కలిపి ఆర్థిక భారాన్ని రెట్టింపు చేస్తున్నాయి. అదే సమయంలో విధుల్లో ఒత్తిడి, కుటుంబం దూరంగా ఉండటం వల్ల మానసికంగా కూడా తీవ్ర ప్రభావం పడుతోంది.

### పదోన్నతులపై ప్రభావం

స్థానికేతరంగా పనిచేస్తున్న హోంగార్డులకు పదోన్నతుల విషయంలో కూడా అన్యాయం జరుగుతోందని వారు వాపోతున్నారు. కానిస్టేబుల్‌గా ఎదగడానికి అవకాశాలు తగ్గిపోవడం, సర్వీస్‌లో నిలకడ లేకపోవడం వారి భవిష్యత్తుపై సందేహాలను పెంచుతోంది.

### పాలకుల వద్దకు వినతులుడ ఫలితం శూన్యం

ఈ సమస్య పరిష్కారం కోసం హోంగార్డులు పలుమార్లు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, మంత్రులు నారా లోకేష్, కేంద్ర నాయకులు బండి సంజయ్, కిషన్ రెడ్డి తదితరులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అయితే, ఈ సమస్యపై ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం వెలువడకపోవడం హోంగార్డుల్లో అసంతృప్తిని పెంచుతోంది.

### విభజన తర్వాత కూడా 'విభజిత జీవితం'

రాష్ట్రాలు పరిపాలన పరంగా విడిపోయినా, హోంగార్డుల జీవితాలు మాత్రం ఇంకా రెండు రాష్ట్రాల మధ్యే చిక్కుకుపోయాయి. ఉద్యోగ భద్రత ఉన్నా, జీవన భద్రత లేకపోవడం వారి పరిస్థితిని మరింత విషమంగా మారుస్తోంది.

### విధి నిర్వహణలో చనిపోయిన హోంగార్డు భార్య ఆవేదన

తన భర్త ఏం విజయ్ కుమార్ కర్నూల్ లో హోంగార్డుగా రాష్ట్ర విభజనకు ముందు నుంచి పనిచేస్తున్నారు విధి నిర్వహణలో భాగంగా హైదరాబాద్ కు బదిలీ అయ్యారు గత పది సంవత్సరాలుగా హైదరాబాదులో విధులు నిర్వహిస్తున్నారు చాలీచాలని జీతంతో జీవితాలు కొనసాగిస్తున్న తరుణంలో తన భర్త విధి నిర్వహణలోనే గుండెపోటు రావడంతో మరణించారని తన కుటుంబ పరిస్థితి ఇప్పుడు ఆర్థికంగా ఇబ్బందులతో ఉందని తనకు ఒక కుమార్తె ఒక కుమారుడు ఉన్నారని వారి జీవితాలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయని ప్రభుత్వం తమ పరిస్థితిని అర్థం చేసుకొని తన కుమారునికి ఉద్యోగం కల్పించాలని మాధవి లత ప్రభుత్వానికి విన్నవించుకున్నారు చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు వారి కుటుంబాల్లో ఒక వ్యక్తికి ఉద్యోగం కల్పించాలని ఉద్యోగ భద్రత లేక ఎంతో మంది హోంగార్డుల కుటుంబాలు వారి జీవితాలు ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రశ్నార్థకంగా మారాయి అని మాధవి లత అన్నారు

### ముగింపు

ప్రజల భద్రత కోసం ముందుండే హోంగార్డుల సమస్యలు కూడా ప్రభుత్వాలకు అంతే ప్రాధాన్యం కలిగి ఉండాలి. స్థానికేతర హోంగార్డులను వారి సొంత రాష్ట్రాలకు బదిలీ చేయడం ద్వారా, వారి జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడం అత్యవసరం.
ఎంతకాలం ఇలాడ 'హోం' కోసం హోంగార్డుల పోరాటం కొనసాగుతుందో అన్న ప్రశ్నకు సమాధానం కోసం వారు ఇంకా ఎదురు చూస్తూనే ఉన్నారు.

## స్వచ్ఛ్ ఆంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమాలు రేపు ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశాలు

**"జలధారజలహారతి" థీమ్‌తో నీటి వనరుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 17)**
జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు మరియు మున్సిపాలిటీల్లో స్వచ్ఛ్ ఆంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.
శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర (సాసా) కార్యక్రమాల అమలుపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ, "జలధారజలహారతి" అనే థీమ్‌తో కార్యక్రమాలను నిర్వహించాలని, ముఖ్యంగా కుంటలు, చెరువులు వంటి నీటి వనరులను శుభ్రపరచడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. చెత్తాచెదారం పేరుకుపోయిన సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అదనపు మున్సిపల్ కమిషనర్ మరియు డిపిఓలకు ఆదేశించారు.అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు సహా అన్ని ప్రభుత్వ సంస్థల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమాలు సమర్థవంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంచార్జి డీఆర్ఓ చిరంజీవి, డిపిఓ భాస్కర్, అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

**పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)"**

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**




**నంద్యాల క్రైం, ఏప్రిల్ 17, (రిపబ్లిక్ న్యూస్):** పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్"పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)"ను నిర్వహించారు. నంద్యాల జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న సుమారు 12 మంది పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్ వారి యొక్క సమస్యల గురించి ఎస్పీకి తెలియచేసారు. సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ వాటిపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయం అధికారులను ఎస్పీ గారు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది యొక్క సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకోని పరిష్కరిస్తున్నామన్నారు. విధులలో సిబ్బంది ఇబ్బంది పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియజేశారు

## మహిళా సాధికారత, మహిళా భద్రత, సైబర్ క్రైమ్ పై అవగాహన


**ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్**






**నంద్యాల క్రైం, ఏప్రిల్ 17, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా పరిధిలోని ఆత్మకూరు పట్టణంలోని ఏం.ఏం.ఫంక్షన్ హాల్ నందు ఆత్మకూరు డిఎస్పీ ఆధ్వర్యంలో ఆత్మకూరు టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి మహిళా పిఎస్ ఇన్స్పెక్టర్ జయరాం సహకారంతో శుక్రవారం సుమారు 300 మంది కస్తూరిబా స్కూల్ విద్యార్థినులు, ఎస్.వి.డిగ్రీ కాలేజ్ విద్యార్థినిలు, మహిళా సంఘాల కార్యకర్తలతో మహిళా సాధికారత, మహిళలపై జరిగే నేరాలు, చైల్డ్ మ్యారేజెస్ మరియు మహిళా భద్రత, సైబర్ క్రైమ్ మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడమైంది. ఈ సందర్భంగా ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ మాట్లాడుతూ మహిళలు తమ హక్కులు, ప్రభుత్వం వారు మహిళల భద్రత కోసం తీసుకున్న చర్యలు, చట్టపరమైన రక్షణ మొదలగు అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అవగాహన కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112 శక్తి యాప్ ద్వారా పోలీస్ సేవలను వినియోగించు కోవాలని తెలిపారు. ఎవరైనా వేధింపులు ఎదురైతే, చట్ట వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే ధైర్యంగా ముందుకు వచ్చివెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు తమ వ్యక్తిగత భద్రతపై జాగ్రత్తలు పాటిస్తూ, సమాజంలో జరిగే అన్యాయాలపై స్పందించాలన్నారు. ప్రస్తుతం సైబర్ క్రైమ్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, స్వీయ నియంత్రణ పాటించాలని,గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చే లింక్ లను ఏపీకే ఫైల్స్ ను ఎట్టి పరిస్థితుల్లో డౌన్లోడ్ చేయరాదని మీ వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోరాదని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు సబ్ ఇన్స్పెక్టర్ నారాయణ రెడ్డి, పోలీస్ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ ఓబులేశ్, ఐసీడీఎస్ సిడిపిఓ కోటేశ్వరమ్మ , సుమారు 300 మంది కస్తూర్బా స్కూల్ విద్యార్థులు, ఎస్వీ డిగ్రీ కాలేజీ, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ స్టూడెంట్స్, మహిళా పోలీసులు, ఆత్మకూరు మహిళా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



**మంత్రాలయం, ఏప్రిల్, 17,(రిపబ్లిక్ న్యూస్ ):** ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ దర్శించుకున్నారు. శ్రీ రాఘవేంద్ర స్వామిమఠం ప్రతినిధులు మేనేజర్ ఎస్ కె శ్రీనివాసరావు, పి ఆర్ ఓ నరసింహమూర్తి ఆయనకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శుక్రవారం ఈ సందర్భంగా శ్రీ గ్రామదేవత మంచాలమ్మకు కుంకుమార్చన నిర్వహించి, అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థులు శ్రీ రాఘవేంద్ర స్వామి మెమౌంటు ఫల మంత్రాక్షికరించి ఆశీర్వదించారు ఆయన వెంట సబ్ కలెక్టర్ విజయ్ కుమార్, తాసిల్దార్ రమాదేవి, పురానిక్ స్వామి, శ్రీపతి స్వామి, భద్రతా దృష్ట్యా సీఐ దస్తగిరి బాబు తన సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com